క్లుప్తంగా

చురుగ్గా మహావస్త్ర రూపకల్పన పనులు



నాగాయలంక: బాపట్లలోని షిర్డీ సాయిబాబా మందిరం పూజారి డాక్టర్ సాయిస్వామి, ఆయన భక్తులు స్థానిక శ్రీరామపాదక్షేత్రాన్ని సందర్శించారు. ఈనెల 31న నిర్వహించనున్న కృష్ణానదికి మహావస్త్ర సమర్పణ వేడుక, ఇక్కడ తరచూ నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆకర్షితుడైన సాయిస్వామి శిష్యులతో వచ్చి ఇక్కడ కొనసాగుతున్న కృష్ణానదికి సమర్పించనున్న మహావస్త్ర రూపకల్పన పనులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మహావస్త్ర సమర్పణలో భాగస్వామ్యం కావాలనే సంకల్పంతో బాపట్ల సాయి మందిరం శిష్యుల నుంచి 54 కొత్త చీరలను సమీకరించి తెచ్చి క్షేత్రపాలకుడు తలశిల రఘుశేఖర్‌కు అందజేశారు.

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

పెడన: పురపాలక సంఘ కౌన్సిల్ అత్యవసర సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు పురపాలక సంఘ కార్యాలయంలోని సమావేశం హాల్లో ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అజెండాలోని 16 అంశాలపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా ఆమె కోరారు.

రేపు 'ఇండియన్ రెడ్‌క్రాస్' సాధారణ సమావేశం

చిలకలపూడి(మచిలీపట్నం): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కృష్ణాజిల్లా వార్షిక సాధారణ సమావేశం ఈ నెల 31వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ గీతాంజలిశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశం హాల్లో సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. నూతన మేనేజ్‌మెంట్ కమిటీ ఏర్పాటు కూడా సమావేశంలో నిర్వహిస్తామని జిల్లాలోని రెడ్‌క్రాస్ ప్యాట్రన్, వైస్‌ప్యాట్రన్, జీవిత, అసోసియేట్ జీవిత సభ్యులు తప్పక హాజరుకావాలని ఆమె కోరారు.

కంది విత్తనాల పంపిణీ



వెంకటాపురం(మోపిదేవి): సాగులో తగు మోతాదులో మందులు వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.హెప్సిబారాణి రైతులకు సూచించారు. వెంకటాపురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వరి సాగును వ్యవసాయాధికారులు పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏవో మాట్లాడుతూ పొలం గట్లపై రెడ్‌గ్రాం, కంది విత్తనాలు నాటుకోవాలని సూచించారు. అవసరమైనవారు రైతు సేవా కేంద్రాల్లో వీఏఏలను సంప్రదించాలన్నారు. ఎంపీపీ రావి దుర్గావాణి, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు, పరుచూరి శ్రీనివాసరావు, వీఏఏలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మంచి విద్యను అందించడమే లక్ష్యం

పెడన: విద్యార్థులకు మంచి విద్యను అందించే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మంగళవారం పెనుమల్లి జెడ్పీ హైస్కూల్లో రూ.60 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదుల శిలాఫలాకాన్ని ఆవిష్కరించి గదులను ప్రారంభించారు. సభానంతరం పూర్వ విద్యార్థులు సీహెచ్ నాగేంద్ర, మణికంఠ నూతన అదనపు తరగతి గదుల్లో బెంచీల కోసం రూ.20 వేలు నగదును ఎమ్మెల్యే ద్వారా హెచ్‌ఎంకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అర్జా వెంకటనగేష్, డీవైఈవో శేఖర్‌సింగ్ నేతలు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



కృత్తివెన్ను: పోడు హైస్కూల్ ప్లస్‌లో విద్యాభ్యాసం చేస్తున్న ఇంటర్మీడియెట్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉపాధ్యాయులు అందించారు. మంగళవారం పాఠశాలలో పీజీటీ ఉపాధ్యాయులు వీరాస్వామి, జ్యోతి, మురళీకృష్ణ, సుబ్రహ్మణ్యం వీటిని హెచ్‌ఎం వీరాంజనేయులు సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో2 కేఎస్‌డీవీ ప్రసాద్, పురుషోత్తం, ఏడుకొండలు, వెంకట్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనారాయణ స్వామి శాంతి కల్యాణం


అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి శాంతి కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేదాంతం మురళీకృష్ణ దంపతులు స్వామివారికి కల్యాణం చేయించారు. అర్చకులు దీవి పార్థసారథి భట్టాచార్యులు, బాలకృష్ణమాచార్యులు, నరసింహమూర్తి శాంతికల్యాణం చేశారు.

చానల్ పగలగొట్టినా పట్టించుకోరా?

- చినగొల్లపాలెం బ్రాంచి కాలువ ధ్వంసం
- అరణ్యరోదనగా రైతుల ఆక్రందన
- నోరుమెదపని అధికారులు
- నీటి సంఘం అధ్యక్షులు చెప్పినా నో వే



చానల్‌ను పరిశీలిస్తున్న రైతులు



ధ్వంసం చేసిన దోమలగొంది చానల్

కృత్తివెన్ను: నీటి చానల్ పగలగొట్టినా పట్టించుకునేవారే కానరావడం లేదు. పంటకాలువ నుంచి అనుమతి లేకుండా చిన్నపాటి ఆయిల్ ఇంజిన్‌తో నీరు తోడితే చాలా పెద్ద నేరంగా పరిగణించి రైతులను నానా ఇబ్బందులకు గురిచేయడం అధికారులకు పరిపాటి. కానీ ఇక్కడ మాత్రం ఏకంగా సబ్‌చానల్‌ను ఇష్టానుసారం పగలగొట్టి నీటిని తరలించుకుపోతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై అక్కడి రైతులు లబోదిబో అంటున్నారు. కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెం బ్రాంచి కాలువపై ఉన్న దోమలగొంది చానల్ కాంక్రీట్‌ను కొందరు వ్యక్తులు అనధికారికంగా పగలగొట్టేశారు. స్థానిక రైతులు వారిని నిలువరించి పోలీసులకు అప్పగించారు. దీనిపై అటు అధికారుల నుంచి కానీ నాయకుల నుంచి కానీ ఎటువంటి చర్యలు లేవు. దీంతో దిగువ ప్రాంత రైతులు తమకు జరిగిన అన్యాయంపై లబోదిబో అంటున్నారు.

ఏమిటీ దౌర్జన్యం!

నీటి అవసరాల కోసం అనుమతి లేకుండా తూములు ఏర్పాటు చేయడం, చానల్‌ను ధ్వంసం చేయడం వంటివి నేరాలుగా పరిగణిస్తారు. ఇక్కడ ఇటువంటి పెద్ద తప్పిదం జరిగి ఐదు రోజులు కావస్తున్నా ఎవ్వరూ పట్టించుకోకపోవడం వెనుక ఏం జరుగుతోందనే ప్రశ్న స్థానిక రైతులతో పాటు మండల ప్రజలకు కలిగింది. దీంతో దిగువ ప్రాంత రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి రైతులు దీనిపై మాట్లాడుతూ చినగొల్లపాలెం బ్రాంచి చానల్‌పై తాడివెన్ను చానల్ ఉంది. దీనిపై అధికంగా ఆక్వా సాగు జరుగుతుంది. ఇటీవల కాలంలో 130 ఎకరాల ఆక్వా చెరువు తవ్వకం జరిగింది. దాని నీటి అవసరాలకు కొందరు వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో అనధికారికంగా చానల్ కాంక్రీట్‌ను ధ్వంసం చేసి, ఎటువంటి అనుమతులు లేకుండా పరిమితికి మించిన తూములను ఏర్పాటు చేశారు.

మూడు వేల ఎకరాలకు నీటి కష్టాలు....

ఎగువనున్న వారు ఇలా ఇష్టానుసారం చేయడంతో ఇదే బ్రాంచి చానల్‌పై దిగువనున్న మూడు వేల ఎకరాల భూములకు సాగునీటి కష్టాలతో పాటు, చినగొల్లపాలెం, పోడు, చినచందాల, పడతడిక గ్రామాల ప్రజలకు నీటి కష్టాలు ఎదురయ్యాయి. చానల్‌ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు, అనధికారికంగా ఏర్పాటు చేసిన తూములను తొలగించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

రెండు రోజుల్లో సరిచేస్తాం

చానల్ ధ్వంసం చేసినట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై రైతులతో మాట్లాడి చానల్ యథావిధిగా ఉండేలా చర్యలు తీసుకుంటాం. ధ్వంసమైన దాన్ని పునఃనిర్మిస్తాం.

–రాజ్యలక్ష్మి, ఇరిగేషన్, ఏఈఈ, కృత్తివెన్ను

నిందితులపై చర్యలేవి

ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం నేరం. ఏకంగా చానల్‌ను ధ్వంసం చేయడం, అనుమతి లేకుండా తూములు ఏర్పాటు చేయడంపై చర్యలు తీసుకోవాలి. అధికారులు ఎందుకు నోరు మెదపడంలేదు. నీటి సంఘం అధ్యక్షులుగా మా కష్టాలు చెప్పినా పట్టించుకోరా. మళ్లీ ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు ఉండాలి.

–యాళ్ల రాజబాబు, చందాల 134, నీటిసంఘం అధ్యక్షుడు

సాగుకు నీరు రావడం లేదు



కాలువకు శివారున వ్యవసాయం చేస్తున్నాను. మా భూములకు నీరు రాకుండా ఎగువనున్న చానల్‌ను ధ్వంసం చేసి నీరు మొత్తం చేపలు, రొయ్యల చెరువులకు పెట్టేసుకుంటున్నారు. ఇది జరిగి ఐదురోజులైనా ఇంతవరకు ఎటువంటి చర్యలు లేవు. అధికారులు ఏం చేస్తున్నారు. మేం వ్యవసాయం చేయాలా మానాలా.

–పులగం అబ్బులు, లక్ష్మీపురం, రైతు

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



పొలం పిలుస్తోందిలో ఏవో జెన్నీ, రైతులు, వీఏఏలు

పెడన: రైతులు వరి పంటలో యాజమాన్య పద్ధతులను అవలంబిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో ఎస్.జెన్నీ అన్నారు. పొలం పిలుస్తోందిలో భాగంగా మంగళవారం ఆమె పెనుమల్లి రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశమయ్యారు. అనంతరం పొలాలను పరిశీలించి రైతులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం వ్యవసాయంలో చాలా మంది రైతులు అధిక దిగుబడులు కోసం రసాయన ఎరువులను అధికంగా వినియోగిస్తున్నారని, అది మంచిపద్ధతి కాదన్నారు. సేంద్రియ ఎరువులను వినియోగించుకోవాలని, యాజమాన్య పద్ధతులను తెలుసుకుని నడుచుకుంటే మంచి ఫలితాలుండటమే కాకుండా అధిక దిగుబడులు పొందవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

యూరియా అరకట్టకు మించి ఇవ్వొద్దు

యూరియా రైతులకు అందుబాటులో ఉండేలా పీఏసీఎస్‌ల కార్యదర్శులు పటిష్ట చర్యలు తీసుకోవాలని, ప్రతి రైతుకు కూడా యూరియా అందించాలన్నారు. మంగళవారం ఏవో పెనుమల్లి, నందిగామ పీఏసీఎస్‌లను తనిఖీ చేశారు. యూరియా నిల్వలను పరిశీలించిన ఆమె ఎకరానికి రెండు బస్తాలు చొప్పున రైతులు అడుగుతున్నారని కార్యదర్శులు ఏవో దృష్టికి తీసుకెళ్లారు. స్టాకు మేరకు రైతులకు అరకట్ట ఇవ్వాలని, పది ఎకరాలున్న రైతులకు ఐదు కట్టలు మించి ఇవ్వొద్దని సూచించారు.

ఎరువులను సిద్ధంగా ఉంచాలి

రైతుసంఘం డిమాండ్



బంటుమిల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘ నేతలు

బంటుమిల్లి: మండలంలో ముమ్మరంగా సాగుతున్న సార్వా సాగులో రైతులకు కావలసిన ఎరువులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యాన మంగళవారం తహసీల్దార్ పూర్ణచంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారని శాస్త్రీయంగా నిరూపణకాని నానో లిక్విడ్ యూరియాను రైతులకు బలవంతంగా అంటకట్టడాన్ని సంఘ నాయకులు తప్పు పట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచాలని వినతిపత్రంలో నాయకులు డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు, నీటి సంఘం మాజీ అధ్యక్షులు సుజ్ఞానం జనార్ధన్‌రావు, ఎం.శివ రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగపంచమి



నాగాయలంకలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష అలంకారం

నాగాయలంక: శ్రావణ మాసం, నాగపంచమి పర్వదినం పురస్కరించుకుని మంగళవారం నాగాయలంక మండలంలోని పలు దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. నాగాయలంకలోని శ్రీవల్లీ శ్రీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు అంబా సాయికిరణ్ శర్మ బ్రహ్మత్వంలో స్వామివారికి ఆవు పాలు, ఆవు పెరుగు, నెయ్యి, తెనె, పసుపు, కుంకుమ తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి ప్రత్యేకంగా అలంకరించారు. మండలంలోని భావదేవరపల్లి శ్రీఅన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో ఆకెళ్ల దేవనాధన్‌శర్మ బ్రహ్మత్వంలో మహిళలు ఆలయ ప్రాంగణంలోని నాగశిలలకు పసుపు, కుంకుమలతో శాస్త్రోక్తంగా పూజ జరిపారు. నాగాయలంకలోని శ్రీపార్వతీ సమేత శ్రీకన్యకా పరమేశ్వరి సమన్విత శ్రీనగరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని నాగశిలలకు ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో కొల్లిపర సుబ్బారావు విశేష పూజలు చేసి నీరాజనాలు సమర్పించారు. టి.కొత్తపాలెంలోని భ్రమరాంబదేవి సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు అంబా సాయికిరణశర్మ ఆధ్వర్యంలో నాగశిలలకు పూజలు చేశారు.

పోస్టాఫీసులో ఆరు నెలలుగా 'ఆధార్' మూత

మచిలీపట్నం హెడ్ పోస్టాఫీసుకు వెళ్తున్న 'పెడన' ప్రజలు



పెడన సబ్ పోస్టాఫీసులో ఆధార్ సెంటర్ ఉంది

పెడన: పెడన పోస్టాఫీసులో ఆర్నెలలుగా ఆధార్ కేంద్రం పని చేయడం లేదు. నియోజకవర్గంలో చాలా మంది పెడనలో సబ్ పోస్టాఫీసుకు ఆధార్ అప్‌డేట్ చేయించుకోవడానికి, కొత్తగా నమోదు చేసుకునేందుకు వచ్చి వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. పాఠశాలల్లో, బ్యాంకుల్లో, వివిధ పథకాలకు ఆధార్ లింకు చేయడంతో చాలామంది ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేయించుకోవడానికి పెడన పోస్టాఫీసును ఆశ్రయిస్తున్నారు. మండలంలోని గ్రామ సచివాలయాల్లో, పట్టణాల్లోని వార్డు సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు పెడుతున్నా వారివారి ప్రాంతాల వారికి మాత్రమే పరిమితమవుతున్నారు. మిగిలిన వారివి చేయకుండా పోస్టాఫీసుకు వెళ్లాలని పేర్కొంటున్నారు.

ఆధార్‌కు బందరెళ్లాలట

పెడన పరిసర ప్రాంతాలకు చెందిన వారే కాకుండా బంటుమిల్లి, గూడూరు, కృత్తివెన్ను ప్రాంతాల నుంచి కూడా ఆధార్ అప్‌డేట్ చేయించుకోవడానికి పెడన సబ్ పోస్టాఫీసును ఆశ్రయిస్తున్నారు. పెడన పోస్టాఫీసుకు వచ్చిన వారు ఆధార్ కేంద్రంలో సిస్టమ్ పని చేయడం లేదని తెలిసి, ఎక్కడకి పోవాలని పోస్టల్ సిబ్బందిని అడిగితే మచిలీపట్నం హెడ్ పోస్టాఫీసుకు వెళ్లాలని సూచిస్తున్నారు. చేసేది లేక మరుసటి రోజు ఉదయమే మచిలీపట్నం హెడ్‌పోస్టాఫీసుకు వెళ్తున్నారు. పెడన పోస్టాఫీసులో ఆధార్ కేంద్రం మూతపడి సుమారు ఆరు నెలలు గడుస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం గమనార్హం.

పని చేయని సిస్టమ్

ఈ విషయమై పెడన పోస్ట్‌మాస్టర్ బీవీ రామకృష్ణ మాట్లాడుతూ ఆధార్ కేంద్రం సుమారు మూత పడి ఐదారునెలలు అవుతోందని, సిస్టమ్ పనిచేయడం లేదని, ఈ విషయాన్ని ఆధార్ ముఖ్యకేంద్రం వారికి సమాచారం తెలియజేశామన్నారు. వారు నేటి వరకు కూడా స్పందించ లేదని తెలిపారు. ఇక్కడకు వచ్చిన వారిని మచిలీపట్నం వెళ్లాల్సిందిగా తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

స్మార్ట్‌మీటర్లు రద్దు చేయండి

సీపీఐ బందరు సహాయ కార్యదర్శి ఈశ్వరరావు



కరపత్రాలు పంచుతున్న సీపీఐ నేతలు

మచిలీపట్నంటౌన్: ప్రమాదకర స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఆగస్టు 5వ తేదీన జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యర్రంశెట్టి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. చమ్మనగిరిపేటలో మంగళవారం స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరుస్తూ కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ బాదుడు ఉండదని చెప్పి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్‌మీటర్లు పగల కొట్టండని లోకేష్, కూటమి నేతలు పిలుపునిచ్చారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మాట తప్పి ప్రజలను నమ్మకద్రోహం చేసిందని చెప్పారు. ఏడాదిలో కరెంట్ బిల్లులు పెరిగిపోయి జనం గగ్గోలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒక్క సంవత్సరంలోనే రూ. 2,787 కోట్ల అదనపు భారం వేశారన్నారు. ఆదాయాలు పెరగక, కరెంట్ బిల్లులు కట్టలేక జనం అవస్థ పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజవర్గ కార్యదర్శి ఒడుగు చైతన్యకుమార్, తాటిపర్తి రామకృష్ణ, యర్రంశెట్టి శ్రీమన్నారాయణ, మోదుమూడి రామారావు, ఒడుగు రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణపై సమీక్ష



ఆకులమన్నాడులో ఇంటింటి చెత్త సేకరణ తీరును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రజావుల్లా

గూడూరు: ఇంటింటి చెత్త సేకరణపై బందరు డివిజనల్ పంచాయతీ అధికారి మహ్మద్ రజావుల్లా సమీక్షించారు. మంగళవారం ఆకులమన్నాడులో పర్యటించిన రజావుల్లా స్థానిక పంచాయతీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రీన్ అంబాసిడర్‌లు ఇళ్లకు వెళ్లి ఎలా చెత్తను సేకరిస్తున్నారన్న విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటి యజమానులతో మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా బుట్టల్లో వేసి చెత్త సేకరణ సిబ్బందికి అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి మహ్మద్ రఫీ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభానికి దూరంగా నగరపాలక సంస్థ జిమ్

బందరులో జిమ్‌ను అందుబాటులోకి తేవాలని కోరుతున్న నగర ప్రజలు



బందరులో మహిళా జిమ్‌లో ఏర్పాటు చేసిన నూతన పరికరాలు

మచిలీపట్నంటౌన్: బందరులో నగరపాలక సంస్థ నిర్వహిస్తున్న ప్రధాన పార్కులో దాతలు ఏర్పాటు చేసిన మహిళా జిమ్ నెలల తరబడి ప్రారంభానికి నోచుకోవడం లేదు. హైదరాబాద్ దివిస్ లేబొరేటరీ సంస్థ లక్షలాది రూపాయలు వెచ్చించి సొంత ఊరిపై ఉన్న మమకారంతో పార్కులో మహిళా జిమ్ ఏర్పాటు చేసింది. దీనిలో మహిళలు వ్యాయామం చేయడానికి అవసరమైన పలు రకాల పరికరాలను సిద్ధం చేశారు. ఈ విభాగాన్ని ప్రారంభించడంలో మున్సిపల్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా ఈ జిమ్‌ను ప్రారంభించి నగర మహిళలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. దాతలు సమకూర్చిన ఈ జిమ్‌ను త్వరితగతిన ప్రారంభించాలని 15వ వార్డు మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ అధికారులకు మంగళవారం విన్నవించారు. నగరంలో పెరుగుతున్న జనాభా దృష్ట్యా మరో వంద ఎకరాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేయాలని ఆమె కోరారు.

విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

6 ఏ కేసుల నమోదు.. ఎరువుల విక్రయాలు నిలుపుదల

చల్లపల్లి: చల్లపల్లి మండల పరిధిలో రికార్డులు సక్రమంగా నిర్వహించని పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు మండల వ్యవసాయాధికారి కె.మురళీకృష్ణ తెలిపారు. విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని చల్లపల్లి, లక్ష్మీపురం, ప్రాంతాల్లోని విత్తనాలు, ఎరువుల షాపులపై విజిలెన్స్ ఏడీఏ (విజయవాడ) వి.కిరణ్‌కుమార్, విజిలెన్స్ ఎస్‌ఐ టి.కృష్ణసాయి, ఏవో మురళీకృష్ణ పలు దుకాణాలను తనిఖీ చేశారు. మండలం మొత్తంలో 32 షాపులు ఉండగా వాటిలో మూడు షాపుల్లో రికార్డుల్లో ఉన్న సరుకు నిల్వలకు షాపులో ఉన్ననిల్వలకు వ్యత్యాసం ఉంటంతో ఆయా షాపులపై కేసులు నమోదు చేసినట్లు వారు తెలిపారు. ఆయా షాపుల్లో రూ.3.34లక్షల విలువ గల విత్తనాలు, రూ.43,750 విలువ ఉన్న ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు అధికారులు తెలిపారు. రికార్డులు సక్రమంగా నిర్వహించని వారిపై కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు.

శ్మశానవాటిక అభివృద్ధి ఏదీ!



మోపిదేవిలంకలో పిచ్చిమొక్కలతో శ్మశానవాటిక



శ్మశానవాటికలో తుప్పు పట్టిన బోరుపంపు

మోపిదేవిలంక(మోపిదేవి): మోపిదేవిలంకలోని శ్మశానవాటిక అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. ఆ ప్రాంగణంలో పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా కనిపిస్తోంది. దీనికితోడు ఆ ప్రాంగణంలో ఆక్రమణలకు తెగపడుతున్నారు. మోపిదేవి లంకలో 12వ నంబర్ కాలువ గట్టు సమీపంలో సుమారు 80 సెంట్లలో రుద్రభూమి ఉంది.

రహదారిపై గోతులు

గ్రామ పంచాయతీ చిన్నది కావడం, దానికి వచ్చే పన్నుల ఆదాయం సిబ్బంది జీతాలకే చాలకపోవడంతో శ్మశానవాటిక అభివృద్ధిని విస్మరించారు. దీనిలోనే ప్రభుత్వం చెత్తనుంచి సంపద కేంద్రం కూడా నిర్మించింది. గ్రామంలో సేకరించిన చెత్తను ఈ కేంద్రానికి తరలించాల్సి ఉంది. కానీ రహదారిపై గోతులు పడి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.

శిథిలావస్థలో బోరుపంపు

శ్మశానవాటికలో వేసిన బోరు పంపు తుప్పు పట్టి శిథిలావస్థలో ఉంది. పిచ్చిమొక్కలతో నిండిపోయిన శ్మశాన వాటికలో పంచాయతీవారు తరచూ కలుపు మందు చల్లుతున్నారు. అయినా మృతదేహాలను ఖననం చేయడం చాలా ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి శ్మశాన వాటిక చుట్టూ రక్షణగా గోడగానీ, ఫెన్సింగ్‌గానీ వేయించాలని కోరుతున్నారు.

శ్మశానవాటికకు రహదారి సౌకర్యం కల్పించాలి



శ్మశానవాటికకు పోయే రహదారిలో గుంతలు ఏర్పడటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్మశాన వాటికలో ఆక్రమణలు తొలగించి, పిచ్చిమొక్కలు తీయించాలి. అధికారులు స్పందించి ఆఖరి మజిలీకి ఇబ్బందులు లేకుండా చూడాలి.

–కొలుసు శివప్రసాద్, మోపిదేవిలంక

నిధుల కొరతగా ఉంది

చిన్న గ్రామ పంచాయతీ కావడంతో నిధుల కొరతగా ఉంది. పిచ్చి మొక్కల తొలగింపునకు కలుపు మందు పిచికారీ చేయించాం. ప్రభుత్వం నిధులు కేటాయిస్తే అభివృద్ధి చేస్తాం.

–రమణ, గ్రామ కార్యదర్శి, మోపిదేవిలంక

హెల్మెట్ తప్పనిసరి

గుడివాడరూరల్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకుని ప్రయాణించాలని ట్రాఫిక్ ఎస్‌ఐ పి.నాగరాజు అన్నారు. పట్టణంలోని బస్టాండ్, ఏలూరురోడ్డు, బంటుమిల్లిరోడ్ తదితర ప్రాంతాల్లో హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగిన సమయంలో తలెత్తే ఇబ్బందులను వివరించారు.

CHANGE OF NAME

I **ANWAR HUSSAIN** (Old Name) S/o. AHMAD HUSSAIN, resident of D.No. 4-768, Chinthachettu Center, Raju Peta, Machilipatham - 521 001, Krishna Dist., Andhra Pradesh. I have changed my name as **MOHAMMAD ANWAR HUSSAIN** (New Name), S/o. Ahmad Hussain. Here after my name is known as **MOHAMMAD ANWAR HUSSAIN** (New Name) S/o. Ahmad Hussain.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పెదననగల్లు(మొవ్వ): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కూచిపూడి ఎస్‌ఐ కేఎస్ విశ్వనాథ్ సూచించారు. మొవ్వ మండలం పెదసనగల్లు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈగల్ క్లబ్ సహకారంతో విద్యార్థులకు మంగళవారం మాదక ద్రవ్యాలతో వచ్చే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం సంజీవరావు, కూచిపూడి ఏఎస్‌ఐ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543 (మచిలీపట్నం, పెడన)
79955 66983 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com